# 6. ఇంటర్‌నెట్ (INTERNET)

ఇప్పటి వరకు కంప్యూటర్ల గురించి, ఆపరేటింగ్ మరియు ఆఫీస్ సాఫ్ట్ వేర్ల గురించి తెలుసు కున్నాము. ఇంటర్ నెట్ గురించి కూడ కొంత సమాచారం తెలుసుకో వలసి వుంది.

మనం మూడు లేక నాలుగు కంప్యూటర్లని ఒకే భవనంలో లేదా ప్రక్క, ప్రక్కనే ఉన్న భవనాల సముదాయంలో ఒకదానితో ఒకటి అనుసంధానిస్తే దానిని "లాన్" అంటారు. అదే కొన్ని వేల కంప్యూటర్‌లను ప్రపంచవ్యాప్తంగా ఒకదానితో ఒకటి అనుసంధానిస్తే దానిని ఇంటర్‌నెట్ అంటారు.

ఇంటర్‌నెట్ లో ముఖ్యంగా నాలుగు రకాలైన సమాచారాన్ని తిలకించగలం, పంపగలం.

సామాన్యమైన సమాచారం ద్వారా మన భావాలను పదిమందికి పంచుకోవడం, యోగక్షేమాలను తెలుపుతూ లేఖలు వ్రాయడం (దీనినే ఇ-మెయిల్ అంటారు) లాంటివి ఈకోవకు చెందుతాయి.

## 6.1. ఇంటర్‌నెట్ ఎలా పనిచేస్తుంది?

ఉదాహరణః ఇంటర్‌నెట్‌ను ఒక జాతీయ రహదారిగా ఊహిస్తే అందులో ఎలా లక్షల రహదారులు ఉన్నాయో, ఇక్కడ ఇంటర్‌నెట్ కూడా అనేక దేశాలను కలుపుతూ, అందులో తిరిగి మళ్ళీ రాష్ట్రాలు, అలాగే సిటీలకు వ్యాప్తి చెందింది.

సిటీలో ఉన్న మన ఇంటికి అడ్రస్ ఎలా ఉంటుందో అలాగే ఇంటర్‌నెట్‌తో కలుపబడిన కంప్యూటర్‌కు కూడా ఒక అడ్రస్ కేటాయిస్తారు. మీరు ఇలా ఇంటర్‌నెట్ కనెక్షన్ పెట్టుకున్న మరో వ్యక్తికి కంప్యూటర్ ద్వారా ఏదేని సమాచారం పంపాలని నిర్ణయించుకుంటే తప్పనిసరిగా ఆ వ్యక్తి తాలూకు కంప్యూటర్ అడ్రస్ తెలిసి ఉండాలి. ఉదాః సిటీలో ఉన్న మన స్నేహితునికి లేఖ వ్రాయాలంటే లేఖ మీద అతని పూర్తి అడ్రస్ తెలియజేస్తాం. అంతే కాని పేరు వ్రాసి పోస్ట్ బాక్స్‌లో వేయం కదా. అలాగే ఇంటర్‌నెట్ వ్యవస్థ కూడా.

## 6.2. ఇంటర్ నెట్ సర్వీసులు

బహుళ ప్రాబల్యం పొందిన ఇంటర్‌నెట్ ఎన్నో సేవలను అందజేస్తుంది. ఇంటర్‌నెట్ సేవలను ఈ క్రింది విభాగాలుగా విభజించవచ్చు.

**1. ఇ-మెయిల్ (E-MAIL):** ఇంటర్‌నెట్ ద్వారా మనం లేఖలను రాసే పద్ధతిని E-MAIL లేదా ELECTRONIC MAIL అంటారు. మనం ఒక లెటర్ రాసి, కంప్యూటర్‌లో వుంచి అవతలవారికి E-MAIL అడ్రస్‌ని వుంచి క్లిక్ చేస్తే ఆ ఉత్తరం ప్రపంచంలో ఎక్కడ వున్నా అవతలవారికి చేరిపోతుంది. అలాగే అవతలవారు ఎన్నో వేల కిలోమీటర్ల దూరంలో వున్నా మనకు క్షణాలలో ఉత్తరాలను కంప్యూటర్ ద్వారా పంపవచ్చు.

WWW (World Wide Web): WWW అంటే వరల్డ్ వైడ్ వెబ్ అని అర్థం అంటే లోకసంచారం లాంటి దన్నమాట. ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచాన్ని చుట్టిరావడం. ఇంటర్‌నెట్ మొత్తం సేవల్లో ప్రఖ్యాతి గాంచిన సదుపాయం ఈ WWW. ప్రపంచంలో జరిగే ఏ విశేషాన్నాయినా ఈ WWW ద్వారా తెలుసుకోవచ్చు. మనకు కావల్సిన పదాన్ని టైప్ చేస్తేచాలు. మొత్తం సమాచారం మన కళ్ళముందు వుంటుంది. గుండుసూది మొదలు విమానం దాకా మనకు ఏ టాపిక్ గురించయినా క్షణాలలో సమాచారాన్ని అందిస్తుంది.

## వరల్డ్ వైడ్ వెబ్ ఎలా పనిచేస్తుంది ?

వరల్డ్ వైడ్ వెబ్ ప్రధానంగా క్లయింట్ సర్వర్ టెక్నాలజీ అధారంగా పనిచేస్తుంది. క్లయంట్ - సర్వర్ టెక్నాలజీ గురించి మీరు ఇంతకుముందే చదివారు. క్లయింట్ సర్వర్ టెక్నాలజీ ఒక ప్రధాన కంప్యూటర్ (సర్వర్) మిగతా కంప్యూటర్‌లకు (క్లయింట్లకు) అనుసంధానింపబడి సమాచారాన్ని మిగతా పరికరాలను పరస్పర మార్పిడి చేస్తుందని మనకి తెలుసు.

సరిగ్గా వరల్డ్ వైడ్ వెబ్ కూడా ఈ సూత్రాం ఆధారంగా పనిచేస్తుంది. అందుకోసం ఇంతకుముందు చెప్పినట్లు ఇంటర్‌నెట్ వెబ్ బ్రౌజర్ (web browser) అనే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తుంది. వెబ్‌సైట్ లోని డాక్యుమెంట్ కోసం ఈ వెబ్ బ్రౌజర్ అడగగా దాంతో ఆ వెబ్‌సైట్‌కు హక్కుదారుడైన కంప్యూటర్ ప్రతిస్పందిస్తుంది. అంటే ఇక్కడ వెబ్ బ్రౌజర్ (సాఫ్ట్‌వేర్) ఒక కస్టమర్ లేదా క్లయింట్‌ల సమాచారాన్ని అడుగగా దానికి ఇంటర్‌నెట్‌లోని ఆ హక్కుదారుడు ప్రతిస్పందించి సమాచారాన్ని అందిస్తాడు. కాబట్టే సమాచారాన్ని అందించే ఆ హక్కుదారుడి లేదా వెబ్‌సైట్‌ని ఇక్కడ సర్వర్ అంటారు. అలా ప్రవహించే సమాచారాన్నే ఓ రకమైన ప్రోటోకాల్ (నియమనిబంధన) నియంత్రిస్తుంది. ఈ సమాచార మార్పిడిలో ఉపయోగించబడ్డ ఆ ప్రోటోకాల్‌నే ఇంటర్‌నెట్ భాషలో HYPER TEXT TRANSPORT PROTOCOL (HTTP) అంటారు. సమాచారాన్ని కావల్సిన రీతిలో మనం (క్లయింట్స్) HTTP నియమాన్ని అనుసరించి అడిగే సమాచారాన్ని సర్వర్ మనకు HTTP నియమాల్లోనే అందిస్తుంది.

ఇక్కడ సమాచార మార్పిడి సక్రమంగా జరగాలంటే మనం అడిగే సమాచారాన్ని ఒక క్రమపద్ధతిలో గుర్తింపబడి వుండాలి. అలా వెబ్ మీద డాక్యుమెంట్‌ని గుర్తించే పద్ధతిని UNIFORM RESOURCE LOCATOR (URL) అంటారు. URL అనే ఈ టెక్నిక్ ద్వారా మనం కోరుకున్న సమాచారపు అడ్రస్‌ని కనుక్కోవడం చేస్తాం. ప్రతి వెబ్ సైట్‌కి ఈ URL ని ఒక క్రమ పద్ధతిలో రూపొందిస్తారు.

ఈ UNIFORM RESOURCE LOCATOR సాధారణ రూపం ఎలా ఉంటుందో చూద్దాం.
<PROTOCAL>://WEB SERVER NAME>/<DIRECTORY-NAMES>/<FILE-NAME>

మొదటి భాగమైన PROTOCOL అర్థమేమిటంటే ఏ రకమైన నియమానికి సంబంధించిందో సూచిస్తుంది. సాధారణంగా ఇంతకు ముందు చెప్పిన HTTP ఇక్కడ వర్తిస్తుంది. ఈ PROTOCOL ఎప్పుడూ '://' తో ముగుస్తుంది. ఇక URL రెండవ భాగం DOMAIN NAME ని సూచిస్తుంది. సాధారణంగా దీనిని WWW గా తీసుకుంటారు. మనం వెబ్ లో ప్రయాణించడానికి, మొదటి రెండు భాగాలు సరిపోతాయి. ఇక

తర్వాత DIRECTORY NAME మరియు FILE NAME మన సౌకర్యం కోసం ఏర్పాటు చేయబడ్డాయి.

ఉదాహరణకు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన YAHOO ని ఇలా URL రూపంలో ఉంచుతారు.
http://www.yahoo.com

అంటే సంస్థ com అయిన yahoo ని http నియమాల ప్రకారం world wide web (www) లో చూపించమని అర్థం.

అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైక్రోసాఫ్ట్ వారి వెబ్‌సైట్ ఈ క్రింది విధంగా ఉంటుంది.
www.microsoft.com

అన్నట్లు ఇంతకు ముందు అధ్యాయంలో మనం ప్రతి కంప్యూటర్‌కి ఒక ఇంటర్‌నెట్ అడ్రస్ ఉంటుంది అని తెలుసుకున్నాం. అయితే ఆ కంప్యూటర్ అడ్రస్, ఈ వెబ్ అడ్రస్‌కి గల తేడా ఏమిటో తెలుసుకుందాం. పైన ఇవ్వబడిన www.microsoft.com అనేది కంప్యూటర్ అడ్రస్ కాదు. అది కేవలం వెబ్‌సైట్ మాత్రమే. ఇది మనం వారి విజ్ఞాన బండారాన్ని సందర్శించడానికి ఉపయోగిస్తాము. మరి sai shiva.vsnl.net.in అంటే కంప్యూటర్ యొక్క అడ్రస్ కాగా Deepu@www.microsoft.com అనేది ఇ-మెయిల్ అడ్రస్.

అయితే ఒకోసారి కొన్ని వెబ్‌సైట్‌ల వారు ఉచితంగా ఇ-మెయిల్ అడ్రస్‌లను ఇస్తున్నారు. ఉదాహరణకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వెబ్‌సైట్ 123 india.com వారు ఉచితంగా ఇ-మెయిల్‌ని అందజేస్తున్నారు. ఉదాహరణకు deepu అనే యూజర్ ఆ వెబ్‌సైట్ అధారంగా deepu@india.com అని తన ఇ-మెయిల్ అడ్రస్‌ని రికార్డ్ చేసుకోవచ్చు.

## 6.3. డొమైన్ పేరు మరియు అడ్రస్ (DOMAIN NAME AND ADDRESS)

ఇంటర్‌నెట్ సర్వీసుద్వారా ప్రస్తుతం కొన్ని లక్షలాది మంది వ్యక్తులు(USERS) కంప్యూటర్ ద్వారా సేవలు పొందుతున్నారు. వీళ్ళందరు ఒక్కొక్కరు ఒక్కో అడ్రస్‌ను కలిగి ఉంటారని ఇంతకుముందే చదివాం. ఉదాహరణకి మన హైదరాబాద్ సిటీలో ఒక ఇల్లు ఉంది. మన బంధువులకు మన ఇంటి అడ్రస్ తెలియజేయాలనుకోండి. ఫలానా సిటీలో ఉంటున్నామని చెబితే వారు కరెక్ట్ అడ్రస్ కనుక్కోలేరు కదా! అందుకే ఇంటినెంబర్, వీధి, ప్రాంతం పేరు, పిన్ కోడ్‌లతో సహా తెలియజేస్తే వారు చిరునామా కనుక్కోవడానికి తేలికగా ఉంటుంది. అలాగే ఇంటర్‌నెట్‌లో మన కంప్యూటర్ యొక్క చిరునామా గుర్తుపట్టడానికి ఒక సంఖ్యను కేటాయిస్తారు. ఆసంఖ్య నే IP చిరునామా (IP ADDRESS) అంటారు.

IP అడ్రసెస్ మొత్తం నాలుగు విభాగాలుగా సంఖ్యలతో రూపొందిస్తారు. ఒక్కో విభాగాన్ని చుక్కతో (PERIOD) విభజిస్తారు. ఇందులో సంఖ్యలు 1 నుంచి 255 వరకూ ఏదయినా ఉండవచ్చు. సంఖ్యల మధ్య ఉన్న చుక్కను ఆక్టెడ్ (OCTED) అని పిలుస్తారు. IP అడ్రసెస్ ఎప్పుడూ కుడి నుంచి ఎడమవైపుకు ఇవ్వబడుతుంది.

ఉదాహరణకి పైన చెప్పినట్లుగా IP అడ్రస్ ఇలా వుండవచ్చు: 201.86.111.71

గమనించండి పైన మొత్తం సంఖ్యలను ఫుల్‌స్టాప్‌లాంటి చుక్కలతో నాలుగు విభాగలుగా విడగొట్టాము. అయితే పైన చెప్పిన సంఖ్యలతో పనిచేయడానికి కంప్యూటర్‌లకు ఏ సమస్యాలేదు. (ఎందుకంటే వాటి పనే సంఖ్యలతో ఆడుకోవడం కాబట్టి). ఏ మనుషులకయితే పై నాలుగు భాగాల సంఖ్యలు తికమకగా ఉండి అడ్రస్‌ని కనిపెట్టలేనట్లుగా వుంటాయి కాబట్టి మనుషులు సైతం ఆ ఇంటర్‌నెట్ అడ్రస్‌లను తేలికగ గుర్తు పట్టడానికి DOMAIN NAME SYSTEM (DNS) అనే పద్ధతి వాడుకలో వచ్చింది. దీనిలో సంఖ్యలకు బదులు పదాలు (WORDS) వాడతారు.

ఉదాహరణకి ఈ క్రింది ఇంటర్‌నెట్ అడ్రస్‌ను గమనించండి. sai shiva.com

పై అడ్రస్‌లో రెండు భాగాలున్నాయి. ఒకటి సంస్థ పేరైన saishiva కాగా, రెండోది అది వాణిజ్య ఉద్దేశాలకుపయోగించగలిగే COM. ఈ క్రింది టేబుల్ అలాంటి అడ్రస్‌లను తేలికగా గుర్తు పట్టవచ్చు.

ఈ క్రింది టేబుల్‌లో ఏసంస్థ ఏ రకపు ఉద్దేశాలకు సంబంధించినదో ఇచ్చాం చూడండి.

| పదంపేరు | సంస్థపేరు | తెలుగుఅర్థం | ఒక ఉదాహరణ |
|---|---|---|---|
| .com | Business | వ్యాపారం | www.microsof.com |
| .edu | educational | విద్యాసంస్థలు | ou.edu.( ou అంటే ఉస్మానియా యూనివర్సిటీ) |
| .gov | government | ప్రభుత్వం | reserve.bank.gov |
| .net | gate way or host | ఇంటర్ నెట్‌ని ఏర్పాటు చేసిన సంస్థ | vsnl.net.in |
| .org | other | ఇతర సంస్థలు | vatcan charch.com |

ఒక్కోసారి ఒక్కో వ్యాపార సంస్థ ఒకటి లేదా అనేక దేశాలలో ఆఫీసులను కలిగి ఉంటుంది. అలాంటప్పుడు ఇంటర్‌నెట్ అడ్రస్ చివర ఆయా దేశం పేరు కూడా క్లుప్తంగా ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఇంటర్‌నెట్‌లో ఒక్కో దేశానికి ఒక్కో కోడ్‌ని కేటాయించారు.

| పదం పేరు | దేశంపేరు |
|---|---|
| au | Australia |
| ca | Canada |
| fr | France |
| in | India |

నిజానికి ఒక్కో దేశానికి పైవిధంగా క్లుప్తంగా పేర్లు ఇచ్చినప్పటికీ, ప్రతి అడ్రస్ చివర దేశం పేరు రావాలనే నియమం ఏమీ లేదు.

ఇప్పుడు పూర్తి DOMAIN NAME (పేరు) ని ఉపయోగించి ఇండియాలో వుండే ఇంటర్‌నెట్ అడ్రస్‌ని ఇలా ఇవ్వవచ్చు.

new heights. vsnl.net.in

ఇప్పుడు ఈ అడ్రస్‌ని కుడి నుండి ఎడమవైపుకు చదవాలి. in అంటే India అని, net అంటే నెట్‌వర్క్ ని ఏర్పాటు చేసినవారు (Network provider) అని, vsnl అంటే మనకు ఆ నెట్‌వర్క్ ని ఏర్పాటు చేసిన ఆధారిత సంస్థ (Videsh Sanchar Nigam Limited) అని. new heights అంటే సర్వర్ లేదా కంప్యూటర్‌కి ఇచ్చిన పేరని అర్థం. పై అడ్రస్‌ను మనం చుక్కల గుర్తుల ద్వారా విడగొట్టాం.

ఇలా పూర్తిగా అడ్రస్ ఇవ్వడాన్నే పూర్తి అర్హత కలిగిన డొమైన్ పేరు (Fully Qualified Domain Name - FQDN) అని పిలుస్తారు.

నిజానికి ఇంటర్‌నెట్ ప్రోటోకాల్ గుర్తించేది కేవలం IP సంఖ్యను మాత్రమే. కానీ పైవిధంగా పూర్తి డొమైన్ పేరు ఎందుకు తెలియజేస్తాం అంటే కంప్యూటర్ ఆపరేట్ చేసే వ్యక్తులకు అర్థమయ్యే రీతిలో కాస్త తేలికగా ఉంటుంది. ఇంటర్‌నెట్‌లో సమాచారాన్ని ఒక క్రమంలో అమర్చే వ్యవస్థనే డొమైన్ నేమ్ సర్వర్/ (DOMAIN NAME SERVER-DNS) అంటారు.

## 6.4. ఇ-మెయిల్

మీరు మీ ఇంట్లో ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉన్న కంప్యూటర్ లో మీ మిత్రుడుని ఉద్దేశించి లేఖ రాశారు. దానిని అమెరికాలో ఉన్న అతనికి పంపడానికి Send (పంపు) అనే ఆదేశం ఇచ్చారు. అంతే మరుక్షణం ఆ లేఖ అమెరికాలోని మీ మిత్రుడు తాలూకు కంప్యూటర్‌లో ప్రత్యక్షమవుతుంది. ఎలాంటి కాలయాపన, ఖర్చు, మనుష్యుల ప్రమేయం లేని ఈ అద్భుత ఉత్తర ప్రత్యుత్తర ప్రక్రియనే ఇంటర్‌నెట్ భాషలో ఇ-మెయిల్ అంటారు.

ఇ-మెయిల్ అంటే ఎలక్ట్రానిక్ మెయిల్. ఇ-మెయిల్‌ని ఉపయోగించి మీరు ప్రపంచంలో ఇంటర్ నెట్ కనెక్షన్ వున్న మరే ఇతర కంప్యూటర్ కైనా సమాచారాన్ని లేఖల రూపంలో మోడెమ్ ద్వారా పంపించవచ్చు. అందుకు మీకు కావల్సిందల్లా అవతలవారి ఇ-మెయిల్ అడ్రస్.

ప్రస్తుతం ఇంటర్‌నెట్ సదుపాయాలలో అన్నిటికంటే అత్యంత ప్రజాదరణ పొందింది ఈ ఇ-మెయిల్. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించే వారిలో 90% ఈ ఇ-మెయిల్‌ని ఉపయోగించి దేశవిదేశాలలోని తమ మిత్రులకు, బంధువులకు లేఖలు పంపిస్తున్నారు. ఈ ఇ-మెయిల్ ఎంతో చౌకే కాకుండా ఉపయోగించటానికి సులభంగా ఉంటుంది. అది విజయవాడ కానివ్వండి, అమెరికాలోని వాషింగ్టన్ కానివ్వండి, అందుకు అయ్యే ఖర్చు ఒకటే. కాబట్టి ఇది STD, ISD, FAX OR TELEX వీటన్నింటికంటే చాలా చౌక. అంతే కాకుండా ఎంతో వేగవంతమైనది. పోస్ట్‌లో సమాచారాన్ని పంపాలంటే

అందుకు కనీసం దేశంలో అయితే మూడు, నాలుగు రోజులు, విదేశాలకయితే వారం రోజులు పడుతుంది. అదే ఇ-మెయిల్ ద్వారా అయితే సమాచారాన్ని సెకండ్లలోనే కావలసిన చోటుకి పంపవచ్చు. పోస్టులో మిస్ కావటం, పోస్ట్‌మాన్ ఆలస్యం చేయడం, మనం పోస్టాఫీసుకు వెళ్ళి ఉత్తరం ఇవ్వడంలాంటి సమస్యలేవీ ఈ ఇ-మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపడంలో ఉండవు. ఇ-మెయిల్‌లో మరొక గొప్పతనం ఏమిటంటే మన ఉత్తరాలను ఎప్పుడైనా తిరిగి ఉపయోగించుకోవచ్చు. మనకువచ్చిన ఉత్తరాలు కంప్యూటర్‌లోనే ఉండడం వల్ల మనం వాటిని కావాల్సిన విధంగా వాడుకోవచ్చు. వాటిలో కొంతభాగాన్ని తొలిగించి కూడా ఉపయోగించుకోవచ్చు.

ఈ ఇ-మెయిల్ ద్వారా కేవలం ఉత్తరాలు మాత్రమే కాకుండా ఎలాంటి సమాచారాన్ని అయినా పంపించుకోవచ్చు. ఉదాహరణకు కంపెనీ ఫైళ్ళు, బడ్జెట్లు, చిత్రాలు, విడియో క్లిప్పింగ్లు, సౌండ్ క్లిప్పింగ్లు వంటి వాటిని కూడా మన లేఖలతోపాటు జత చేసి ఏ ప్రదేశానికి అయినా పంపడం సాధ్యపడుతుంది. పైగా ఇ-మెయిల్ మన పనులను డిస్టర్బ్ చేయదు. ఫోను, ఫాక్స్ సాధనాల్లా ఇ-మెయిల్ - మనం ముఖ్యమయిన పనిలో వున్నప్పుడు అంతరాయం కల్పించదు. ఇది నిశ్శబ్దంగా మన కంప్యూటర్ బాక్స్‌లో చేరుకుంటుంది. మనం కంప్యూటర్ తెరిచి చూసినప్పుడు ఆ ఉత్తరం మనకు కనిపిస్తుంది.

## 6.4.1. ఇ-మెయిల్ అడ్రస్‌లు

ఇ-మెయిల్ అడ్రసులను అర్థం చేసుకోవడం చాలా తేలిక. ప్రతి ఇ-మెయిల్ అడ్రస్ ముఖ్యంగా నాలుగు లక్షణాలను కలిగి వుంటుంది.

1. **User ID**: ఇ-మెయిల్ ఉపయోగించే ప్రతి వ్యక్తి ఒక గుర్తింపు (Identification) ని కలిగి వుంటాడు. ఉదాహరణకు శంకర్ లేదా ఇంకొద్ది పొడవైన పేరు కలిగి వుండవచ్చు.

2. **@**: ఈగుర్తును కంప్యూటర్ సర్వర్ పేరుని, పైన చెప్పిన user పేరుని విడదీయడానికి ఉపయోగిస్తారు.

3. **Name**: మనకు ఇ-మెయిల్ సౌకర్యాన్ని కలగజేసే Server పేరు ఇక్కడ పేర్కొంటారు.

4. **Domain**: డొమైన్ అనేది మూడు అక్షరాల కోడ్. అది అడ్రస్‌ల యొక్క లక్షణాలను తెలుపుతుంది. ఉదాహరణకు అడ్రస్-బిజినెస్‌కు సంబంధించినది అయితే .com అని, లాభాపేక్షలేని సంస్థ అయితే .org, అదే యూనివర్శిటి అయితే .edu ప్రభుత్వమునకు సంబంధించినది అయితే .gov తెలియజేస్తుంది.

ఇప్పుడు పై నాలుగు లక్షణాలను ఉపయోగించి ఓ ఇ-మెయిల్ ని సృష్టిద్దాం.




పై ఉదాహరణలో sankar అనేది కంప్యూటర్‌ని ఉపయోగించే వ్యక్తి యొక్క ఐడెంటిఫికేషన్ కాగా hotmail అనేది సర్వర్ అడ్రస్. ఇక com అనేది డొమైన్ పేరు. user అయిన sankar ని @ అనే గుర్తుని ఉపయోగించి విడగొట్టడం.

## 6.4.2. ఇ-మెయిల్ లోకి ప్రవేశించుట (Acess of e-mail)

ఇంటర్‌నెట్ ద్వారా ఇ-మెయిల్‌లోకి ప్రవేశించడానికి ఎన్నో పద్ధతులు ఉన్నాయి. ఇంటర్‌నెట్ లో ప్రత్యేక ఇ-మెయిల్ సాఫ్ట్‌వేర్ లోడ్ చేయడం ద్వారా ఇ-మెయిల్‌లోకి ప్రవేశించడం ఒక పద్ధతి కాగా, ఉచిత ఇ-మెయిల్ సౌకర్యం కలిగించిన వెబ్ సైట్ల ద్వారా ఇ-మెయిల్‌లోకి ప్రవేశించటం రెండో పద్ధతి. అయితే ఇప్పటి ట్రెండ్ ఏమిటంటే రకరకాల వెబ్ సైట్లు (ఉదాహరణకు yahoo mail, hotmail, mailcity, usa.net లాంటివి) తమ సైట్లలో రిజిష్టర్డ్ చేయించుకున్న వారికి ఉచిత (Free) ఇ-మెయిళ్ళని అందజేస్తున్నారు. ఇప్పుడు దేశంలో 90 శాతం ఈ ఫ్రీ ఇ-మెయిల్‌నే ఉపయోగిస్తున్నారు. ఈ ఫ్రీ ఇ-మెయిల్‌లు ఇంటర్‌నెట్ వెబ్ బ్రౌజర్ల (Netscape Communiator or Internet Explorer) ఆధారంగా TCP/IP అకౌంట్ ప్రోటోకాల్ పద్ధతిన నడపబడతాయి. ఈ నేపథ్యంలో ఈ అధ్యాయంలో వెబ్ సైట్లద్వారా ఉచిత మెయిల్స్‌ని పంపే పద్ధతికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. www లో బ్రౌజరు ఏదైనా సమాచారం కోసం ఎలా వెతుకుతుందో అలాగే ఇక్కడ కూడా కావల్సిన ఇ-మెయిల్ అడ్రస్ కోసం బ్రౌజర్ ఆయా వెబ్ సైట్‌లను వెతికి మనకు అందిస్తుంది.

వెబ్ సైట్ల ద్వారా ఇ-మెయిల్‌ని ఇవ్వడం వల్ల ఒక మంచి ప్రయోజనం వుంది. ఏమిటంటే వీటి ద్వారా ఇ-మెయిల్‌ని మనం ఉచితంగా పంపవచ్చు. (కేవలం ఇంటర్‌నెట్‌లో ప్రవేశించేందుకు మాత్రమే మనం డబ్బు చెల్లించాల్సి ఉంటుంది సుమా) కాబట్టి ఎలాంటి రుసుం చెల్లించకుండా వెబ్ సైట్లు ఇ-మెయిల్‌లలో పంపడం వల్ల ఈ పద్ధతి బహుళ ప్రాచుర్యం పొందింది. అంతేకాకుండా ఈ పద్ధతి ద్వారా రిజిస్టర్ చేసుకున్న ప్రతి వ్యక్తికి మూడు నుండి ఐదు మెగా బైట్ (M.B.) దాకా ఫ్రీ వెబ్ సైట్ స్థలం కేటాయిస్తుంది. దాంతో ప్రస్తుతం అంతా ఈ పద్ధతి ద్వారానే ఇ-మెయిల్‌లను అందుకోవడం, పంపడం చేస్తున్నారు.

అయితే వెబ్ సైట్ల ద్వారా మీరు ఉచితంగా ఇ-మెయిల్ సౌకర్యాన్ని పొందాలంటే మీరు ముందుగా రిజిస్టర్ చేయించుకోవాలి. అంటే మీపేరు, మీ పాస్‌వర్డ్ వగైరా వివరాలు ఇచ్చేసి నమోదు చేసుకోవాలి. అందువల్ల భవిష్యత్తులో మీరు తిరిగి ఇ-మెయిల్‌ని తెరవాలన్నా, ఇవ్వాలన్నా కంప్యూటర్‌లోని వెబ్ సైట్లు ఆ పాస్‌వర్డ్‌ని అడుగుతాయి. పాస్‌వర్డ్‌ని ఉపయోగించడంవల్ల మీ ఇ-మెయిళ్ళను ఇతరులు తెరవకుండా నిరోధించవచ్చు.

అలా ఉచితంగా ఇ-మెయిల్‌ని అందించే కొన్ని ముఖ్యమైన వెబ్ సైట్లను ఇక్కడ ఇస్తున్నాము.

www.yahoomail.com
www.hotmail.com
www.mailcity.com

www.usa.net
www.rediff.com
www.coolmail.com
www.123india.com

ఇక ప్రస్తుతం పై వెబ్‌సైట్ల ద్వారా ఇ-మెయిల్‌ని ఎలా ఆపరేట్ చేయాలో చూద్దాం.

ఉచిత వెబ్‌సైట్ల ద్వారా ఇ-మెయిల్స్‌ని ఇవ్వడం

వెబ్ సైట్ల ద్వారా ఇ-మెయిళ్ళని పంపాలన్నా, అందుకోవాలన్నా ముందుగా ఆయా సైట్లలో మనం రిజిస్టర్డ్ చేయించుకోవాలని ఇంతకు ముందు చదివాం.

అలా వెబ్ సైట్ల రిజిస్టర్ చేసుకోవడాన్నే ఇ-మెయిల్ పరిభాషలో 'అకౌంట్‌ని సృష్టించుకోవడం' అంటాం.

## 6.4.3. మీ అక్కౌంట్‌ని సృష్టించుకోండి

ఇక్కడ అక్కౌంట్ అంటే మన యూజర్ నేమ్, పాస్ వర్డ్ వగైరా వివరాలను పేర్కొని మనకోసం ఓ అక్కౌంట్‌ని సృష్టించుకోవడం అన్నమాట. బ్యాంక్‌లో మనడబ్బుని ఇతరులు తీసుకోకుండా వుండటానికి మనం ఓ అక్కౌంట్ నెంబరు, మన సంతకంతో ఎలా రిజిస్టర్ చేయించుకుంటారో, ఇక్కడ కూడా మన యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ని మనం కంప్యూటర్‌కు ఇస్తామన్న మాట. మళ్ళీ మనం బ్యాంక్‌కు వెళ్ళి డబ్బును డ్రా చేసుకోవడానికి అక్కౌంట్ నెంబర్, సంతకం ఎలా ఇస్తామో అదే విధంగా మనం ఫ్రీ ఇ-మెయిల్ ఇవ్వాలంటే మన యూజర్ నేమ్, పాస్‌వర్డ్ పెర్కొనాలి.

## 6.4.4. ఇ-మెయిల్ పంపడం

ఇప్పుడు మీకంటూ ఇ-మెయిల్ అడ్రస్ (ఉదాహరణకు teluguwriter@rediff.com) వచ్చింది కదా! ఇప్పుడు మీరు ఆ అడ్రస్ ఆధారంగా rediffmail లో ఒక ఇ-మెయిల్‌ని పంపించి చూద్దాం. అందుకోసం మీరు తిరిగి rediffmail లో వెళ్ళండి. అంటే File --> enter లో www.rediffmail.com అని టైప్ చేయండి. ఫలితంగా ఈ క్రింది బాక్స్ వస్తుంది.




పైతెరలో మీ **login name** (ఉదాహరణకు **telugu writer**) పాస్‌వర్డ్ వగైరా వివరాలను పూర్తి చేయండి. తరువాత మీరు పైతెరలో **enter** అన్న బాక్స్ మీద క్లిక్ చేయండి. ఫలితాంగా ఈ క్రింది తెర వస్తుంది.




పైతెరలో **compose** అన్నదాని మీద క్లిక్ చేయండి. ఫలితంగా మీరు ఇ-మెయిల్ పంపడం కోసం ఈ క్రింది తెర ప్రత్యక్షమవుతుంది. అందులో మనం ఇ-మెయిల్‌ని ఎవరికి పంపాలో వారికి పంపవచ్చు.

ఇప్పుడు మనం ఇ-మెయిల్ ఎవరికి పంపాలని అనే ప్రశ్న ఉదయిస్తుంది. అన్నట్లు ఒక ఐడియా! మనకు మనమే ఇ-మెయిల్‌ని ఇచ్చుకుందాం. అందువల్ల ఇ-మెయిల్‌లో ఎక్కడ తప్పులు చేసామో మనకే బాగా అర్థం అవుతుంది. అంతేకాకుండా మనకు ఇ-మెయిల్ పంపించడం వచ్చిందో లేదో తెలుస్తుంది.




1. ముందుగా To అన్న బాక్స్‌లో ఉత్తరాన్ని ఎవరికి పంపాలని కోరుకుంటున్నామో వారి పేరు (అంటే ఇ-మెయిల్ అడ్రస్) టైప్ చేయండి. ప్రస్తుతం ఇ-మెయిల్ మనకు మనమే పంపించుకుంటున్నాం. కాబట్టి మన ఇ-మెయిల్ అడ్రస్ అయిన teluguwriter@rediff.com పూర్తి చేయండి.

2. లెటర్ లో మీరు ఏమి చెప్పదలుచుకున్నారో ఆ విషయాన్ని (Subject) క్లుప్తంగా ఒక వాక్యంలో పేర్కొనండి.

3. ఇంకా మీరు ఎంత మందికి పంపాలనుకొన్నారో వారిపేర్లు (అవి ఏ-మెయిల్ అడ్రస్‌లే) టైప్ చేయండి. ప్రస్తుతం మనం ఇంకా ఎవరికీ పంపదలుచుకోలేదు కాబట్టి ఈ కాలమ్ వదిలేయండి.

4. ఈ కాలమ్‌ని కూడా పూర్తి చేయకుండ వదిలేయండి.
5. ఇప్పుడు లెటర్‌లోని విషయాన్ని టైప్ చేయండి.
6. తరువాత మీరు పైతెరలోని send ఐకాన్ బటన్ దగ్గరకు వచ్చి క్లిక్ చేయండి.




మీరు ఇ-మెయిల్ పంపగానే మీ లేఖ అవతలివారికి చేరినట్లుగా ఈ క్రింది విధంగా ఒక చిన్న సమాచారం వస్తుంది.

## 6.4.5. ఇ-మెయిల్‌ని అందుకోవడం, చదవడం

ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉన్న ప్రతి వ్యక్తి మొదట చేసే పని ఇ-మెయిళ్ళని చూడడం. మనం సాయంకాలం ఆఫీసు నుండి రాగానే ఏదైనా పోస్ట్ వచ్చిందేమో అన్నట్లుగా లెటర్ బాక్స్‌ని ఎలా చూస్తామో, అలాగే మనకేమైనా లెటర్స్ వచ్చాయేమోనని కంప్యూటర్ లో చూడటమన్నమాట.

మీరు ఇ-మెయిల్ ను అందుకోవలన్నా, చదవాలన్నా మీకు ఏదన్నా ఫ్రీ ఇ-మెయిల్‌లో రిజిస్ట్రేషన్ ఉండాల్సిందేనని ఇంతకుముందే మనం అకౌంట్‌ను ఎలా ఓపెన్ చెయ్యాలో తెలుసుకున్నాం. ఆ అకౌంట్ లోని login name, password ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

ఇప్పుడు మనం ఇ-మెయిల్‌ని ఎలా అందుకోవాలో సోదాహరణంగా చూద్దాం. ముందుగా మీ ఇంటర్‌నెట్‌ను ఓపెన్ చేసి File-->open మీద క్లిక్ చేసినపుడు వచ్చిన బాక్స్‌లో www.rediffmail.com అని టైప్ చేయండి. ఫలితంగా ఈ క్రింది తెర వస్తుంది.




తెరలో మీ login name, password వివరాలను నింపండి. ఇక్కడ login name అంటే teluguwriter అని టైప్ చేసి ఆ తర్వాత పాస్‌వర్డ్‌ని ఈ క్రింది తెరలో చూపినట్లుగా టైప్ చెయ్యాలి.




ఆ తర్వాత enter మీద క్లిక్ చేస్తే చాలు.

అప్పుడు మనం నేరుగా తెరలోకి అడుగుపెడతాము. అందులో మనకి ఏమైనా లెటర్స్ వచ్చాయో చూసుకుందాం. ఒకవేళ మనకు ఎవరూ లెటర్స్ పంపకపోయినా ఫర్వాలేదు. ఎందుకంటే ఇంతకుముందే మనం మన పేరు మీద ఒక లెటర్ ను పంపించుకున్నాం కదా! దానినే చూసుకుందాం.




క్రింది rediffmail Inbox మీద క్లిక్ చేయండి. ఫలితంగా మీ ముందు ఈ తెర ప్రత్యక్షమవుతుంది.




పై తెరలో రకరకాల ఉత్తరాలలో దేనినైనా చూడాలంటే మౌస్‌ని ఆ ఉత్తరం మీదకు తీసుకువెళ్ళి క్లిక్ చేయండి. పైతెరలో మనకి ఒకే ఉత్తరం వచ్చినట్లుగా తెలుస్తుంది. ఆ ఉత్తరాల్లో కూడా కొత్తగా వచ్చింది ఒకే ఉత్తరమని **rediff mail** మనకి తెలియజేసింది. నిజానికి ఆ ఉత్తరం కూడా మనకి మనమే ఇంతకుముందు ఇ-మెయిల్ ఇచ్చుకున్నదే. ఇప్పుడు ఆ ఉత్తరం చదవాలంటే మీరు దానిమీద కర్సర్‌ను ఉంచి క్లిక్ చేయండి. వెంటనే ఆ ఉత్తరం తాలూకు సమాచారం మీకంటి ముందు కనిపిస్తుంది.

***